సాక్షి తిరుపతి

సోమవారం ၊ 24 ၊ ఏప్రిల్ ၊ 2023



శాస్త్రోక్తం.. అష్టోత్తర శత శంఖాభిషేకం

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయంలోని గురు దక్షిణామూర్తికి ఆదివారం వైభవంగా అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహించారు. – 8లో



తిరుపతిలో వర్షం

తిరుపతి : నగరంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజానీకం ఊపిరి తీసుకుంది.

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	36	26
తిరుమల	32	22
గూడూరు	37	28
నగరి	37	27

న్యూస్‌రీల్

నృసింహుని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



శ్రీవారి రాజగోపురానికి విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రాపూరు : మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామివారికి మే 1వ తేదీ నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవారి రాజగోపురాన్ని విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో, భక్తులు నడిచే మార్గలంలో చలువ పందిళ్లు వేయిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 72,631 మంది స్వామివారిని దర్శించుకోగా.. అందులో 38,529 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

'పేటశ్రీ జీవితం- రచనలు' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

తిరుపతి మంగళం : ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి జీవితం- రచనలు పుస్తకాన్ని ఆదివారం మారుతీనగర్‌లోని నివాసంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి రచించిన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో జీవిత చరిత్రలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేటశ్రీ సుమారు 30ఏళ్ల పాటు అధ్యాపకుడిగా ఎస్వీ యూకి సేవలందించారని కొనియాడారు. ఎస్వీయూ వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ తిరుపతి సంబంధితంగా పేటశ్రీ అనేక రచనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టు మీసరగండ పాండురంగరాజు, పుట్టా మునిరత్నంరెడ్డి, తెలుగు అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ పేట శ్రీనివాసులు రెడ్డి, మళ్లా పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.

షార్ డైరెక్టర్‌కు విశిష్ట పురస్కారం

సూళ్లూరుపేట : శ్రీహరికోట షార్ డైరెక్టర్ గోపీకృష్ణకు విశిష్ట పురస్కారం లభించింది. గుంటూరుకు చెందిన తెలుగు సంస్కృతి అకాడమీ వారు ఉగాది సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులను పురస్కారాలకు ఎంపిక చేశారు. ఈ క్రమంలో విద్య, శాస్త్ర సాంకేతిక రంగానికి సంబంధించి గోపీకృష్ణ ఎంపికయ్యారు. ఆయనకు ఈ నెల 25వ తేదీన గుంటూరులోని ఆచార్య నాగార్జున వర్సిటీలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం అందజేయనున్నారు.

పచ్చదనం- పరిశుభ్రతలో కాదలూరు ఫస్ట్

తడ: పచ్చదనం- పరిశుభ్రతకు సంబంధించి కాదలూరు పంచాయతీ తొలిస్థానంలో నిలిచినట్లు ఎంపీడీఓ ఆమోస్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో వివిధ విభాగాల కింద చేపట్టిన ఎంపికల్లో బహుమతి దక్కించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 24వ తేదీన నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ కిలివేటి మస్తానమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎల్.శేషారావు అవార్డును అందుకోనున్నట్లు వెల్లడించారు.

గురుకులం విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీడీ

కోట : రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరచి, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి సుయోన్‌ను ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, పీడీ శ్రీరేష్ అభినందించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన చిత్తూరులో జరిగిన అండర్-17 రెజ్లింగ్ పోటీల్లో సుయోన్ బంగారు పతకం సాధించాడన్నారు. జాతీయ పోటీల్లో సైతం సత్తా చాటినట్లు వెల్లడించారు.

గుండె గుడి

శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం.. చిరు గుండెలకు స్పందనగా మారింది. పసి ప్రాయంలోనే ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడే వారికి పునర్జన్మను ప్రసాదిస్తోంది. హృదయమార్పిడి శస్త్రచికిత్సను సైతం ఉచితంగా నిర్వహిస్తూ నిరుపేద చిన్నారులకు ఊపిరిపోస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికగా అమూల్యమైన సేవలందిస్తోంది. ప్రస్థానం ప్రారంభించిన అనతికాలంలోనే దేశ వ్యాప్తంగా కీర్తిపతాకను ఎగురవేస్తోంది. వందలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది.





తిరుపతి శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వద్ద పోలీసులు



విశాఖపట్టణం నుంచి తీసుకువచ్చిన గుండెని ఆస్పత్రిలోకి తరలిస్తున్న వైద్య బృందం

- గుండె మార్పిడికి చిరునామా శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం
- ఇప్పటి వరకు విజయవంతంగా మూడు ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు
- ఆరోగ్యశ్రీ కింద ఉచితంగానే రూ.లక్షల విలువైన సేవలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేరుస్తున్న వైద్యులు

సాక్షి, తిరుపతి : నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులు ఎంతోమంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి ఆపరేషన్లు చేయించుకోలేక పోయేవారు. ఆర్థిక స్తోమత లేక కళ్లెదుటే కన్నబిడ్డ ఊపిరి వదిలేస్తుంటే తల్లిదండ్రులు బాధ వర్ణనాతీతంగా ఉండేది. ఈ పరిస్థితులను గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. తిరుపతిలో చిన్నపిల్లల గుండె ఆస్పత్రి ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ మేరకు ఆస్పత్రి బాధ్యతలను తిరుమల తిరుపతి దేవస్థానాలకు అప్పగించారు. వెంటనే టీటీడీ సైతం స్పందించి శరవేగంగా శ్రీపద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ నిర్మాణం చేపట్టింది. 2021 సెప్టెంబర్ 11వ తేదీన ఈ ఆస్పత్రిని ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీపద్మావతి హృదయాలయాన్ని తన మానసపుత్రికగా ప్రకటించారు. పేద పిల్లల ప్రాణాలకు భరోసా కల్పించారు.

తొలి ఆపరేషన్ ఇలా..

తిరుపతిలోని టీటీడీ శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో ఈ ఏడాది జనవరి 20వ తేదీన తొలిసారి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేశారు. విశాఖలో జనవరి 16వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జంజూరు సన్యాసమ్మ (48)కు బ్రెయిన్ డెడ్ అయ్యింది. ఆమె బంధువులు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో అవయవదానం చేశారు. ఆమె గుండెను ప్రత్యేక విమానంలో పటిష్ట బందోబస్తుతో గ్రీన్‌చానల్ ద్వారా రేణిగుంట విమానాశ్రయానికి అక్కడి నుంచి టీటీడీ అంబులెన్స్‌లో తిరుపతిలోని చిన్నపిల్లల హృదయాలయానికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న అన్నమయ్య జిల్లా చిట్వేల్ మండలం కేఎస్ ఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన చెందిన 15 ఏళ్ల బాలుడికి వైద్యులు అత్యంత నైపుణ్యంగా ఆపరేషన్ చేసి గుండెను అమర్చారు. ప్రస్తుతం ఆ బాలుడు ఆరోగ్యంగా ఉన్నాడు. మరో నెల వ్యవధిలోనే 13 నెలల చిన్నారికి గుండె మార్పిడి చేసి హృదయాలయ వైద్యులు ప్రశంసలందుకున్నారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన 13నెలల పాపకు గుండె దెబ్బతింది. తల్లిదండ్రులు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పాపకు గుండె మార్చాలని డాక్టర్లు చెప్పడంతో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం గురించి తెలుసుకుని తిరుపతికి తీసుకువచ్చారు. పాపకు సరిపోయే గుండె కోసం వైద్యులు జీవన్ దాన్‌లో రిజిస్టర్ చేశారు. మందులు ఇస్తూ పాపప్రాణాలను కాపాడుతూ వచ్చారు. చెన్నై ఎంజీఎం ఆస్పత్రిలో రెండేళ్ల బాలుడుకి బ్రెయిన్ డెడ్ అయ్యింది. బాబు గుండెను దానం చేయనున్నట్లు సమాచారం అందుకున్న పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి అక్కడి వారితో మాట్లాడారు. వైద్యబృందంతో సమన్వయం చేసుకుని ఫిబ్రవరి 27వ తేదీన టీటీడీ ప్రత్యేక అంబులెన్స్ ద్వారా 2 గంటల 15 నిముషాల్లో చెన్నై నుంచి తిరుపతికి గుండెను తరలించారు. వెంటనే పాపకు గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేసి పునర్జన్మనిచ్చారు. దాదాపు రూ.30 లక్షలు ఖర్చు అయ్యే గుండె మార్పిడి శస్త్ర చికిత్సను రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేయించడం విశేషం.

హృదయ స్పందన..

- మల్లారెడ్డి కిరణ్‌చంద్ వయసు : 16 ఏళ్లు
- బ్రెయిన్ డెడ్ : ఇంట్రాక్రానియల్ ట్యూమర్
- గుండె గ్రహీత : రితిశ్రీ (ఐదేళ్లు)
- రోగం : డైలేటెడ్ కార్డియోమయోపతి
- శ్రీకాకుళం నుంచి వైజాగ్ వరకు రోడ్డు మార్గం : 115 కిలోమీటర్లు
- చేరుకున్న సమయం : 90 నిమిషాలు
- వైజాగ్ నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు : 95 నిమిషాలు
- ఎయిర్‌పోర్ట్ నుంచి తిరుపతిలోని హృదయాలయానికి : 24 నిమిషాల్లో
- చిన్నపిల్లల హృదయాలయంలో గుండెను స్వీకరించిన సమయం : సాయంత్రం 6.45

అందరూ అలెర్ట్..

శ్రీకాకుళంలో బ్రెయిన్ డెడ్ అయిన బాలుడి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చిన విషయం తెలుసుకున్న సీఎంఓ అధికారులు వెంటనే శ్రీకాకుళం, విశాఖపట్నం, తిరుపతి జిల్లాల ఎస్పీలను అలెర్ట్ చేశారు. గుండెను వాహనంలో తరలించే మార్గాన్ని గ్రీన్ చానల్‌గా ప్రకటించి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో తిరుపతిలోని శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ వైద్యుల బృందం శనివారం రాత్రే శ్రీకాకుళం బయలుదేరి వెళ్లింది. బాలుడి గుండెను సేకరించి తిరుపతికి తీసుకువచ్చింది. అప్పటికే చిన్నారి రితిశ్రీని ఆపరేషన్ థియేటర్లో సిద్ధం చేయడంతో గుండె చేరుకోగానే వెంటనే ఆపరేషన్ ప్రక్రియను ప్రారంభించింది.

వడివడిగా అడుగులు..



ఆస్పత్రి వద్దకు ప్రత్యేక అంబులెన్స్‌లో గుండెను తీసుకొస్తున్న దృశ్యం

శ్రీపద్మావతి హృదయాలయం వడివడిగా అడుగులు వేస్తూ విజయ పథంలో ముందుకు సాగుతోంది. ఇక్కడి వైద్యులు సైతం సేవాభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరుస్తున్నారు. అనతికాలంలో 1,350కు పైగా గుండె సంబంధిత శస్త్రచికిత్సలను పూర్తి చేశారు. ముఖ్యంగా గుండె మార్పిడి ఆపరేషన్లను దిగ్విజయంగా నిర్వహిస్తూ ఆస్పత్రికి ఎనలేని కీర్తిప్రతిష్ఠలను తీసుకువచ్చారు. ఇప్పటి వరకు 3 హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలను సక్సెస్ చేశారు. తాజాగా ఆదివారం నెల్లూరుకు చెందిన ఓ చిన్నారికి గుండె మార్పిడి చేశారు. శ్రీకాకుళంలో బ్రెయిన్ డెడ్ అయిన బాలుడి గుండెను ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్‌లో ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువచ్చారు. అనంతరం రోడ్డు మార్గంలో అత్యంత జాగ్రత్తల నడుమ నిముషాల వ్యవధిలోనే శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రికి తరలించారు. విజయవంతంగా గుండె మార్పిడి శస్త్రచికిత్సను పూర్తి చేశారు.



ఆస్పత్రి వద్ద గుమికూడిన ప్రజలు



రితిశ్రీ తల్లిదండ్రులు

ఆధ్యాత్మిక సొబగులు.. అభివృద్ధి వెలుగులు



నాగాలమ్మ ఆలయ కుంభాభిషేక పూజల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలతమ్మ దంపతులు, ఎమ్మెల్యే ఆదిమూలం



రామాపురంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు : సత్యవేడు నియోజకవర్గంలోని పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పర్యటించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ముందుగా ఉదయం 9 గంటలకు మంత్రి పెద్దిరెడ్డి, సర్వలతమ్మ దంపతులు స్వయంభు నాగాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి ఆలయ విమానగోపుర కుంభాభిషేకంలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ రేఖ, సింగిల్‌విండో చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి, ఆలయ ధర్మకర్త వి.నాగరాజు ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి దంపతులను సత్కరించారు. అనంతరం రామాపురం చేరుకుని రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలోనే సురుటపల్లెలో వెలసిన మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరాలయంలో నిర్వహిస్తున్న గురు సంచార పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందించి, ఆశీర్వదించారు. మంత్రి దంపతులు, ఎమ్మెల్యేను ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు విష్ణుప్రియ, నేతలు అపరంజిరాజు, గవర్ల కృష్ణయ్య, దయాకర్ రెడ్డి, సుశీల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి, తాడిపత్రి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు బీరేంద్ర వర్మ, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు చిన్నదొరై, ట్రేడ్ యూనియన్ చైర్మన్ సురేష్, ముత్తరాసి కార్పొరేషన్ డైరెక్టర్ ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీకి భారీ ఊరట

- విదేశీ కరెన్సీ మార్చుకునేందుకు అనుమతి

తిరుమల: విదేశీ కరెన్సీ డిపాజిట్ల అంశంలో టీటీడీకి భారీ ఊరట లభించింది. మూడేళ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారానికి కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఫుల్‌స్టాప్ పెట్టింది. శ్రీవారికి భక్తులు సమర్పించిన విదేశీ కరెన్సీ కానుకలను బ్యాంక్‌లో డిపాజిట్ చేసుకునేందుకు కేంద్రం అనుమతిచ్చింది. శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులు తమ మొక్కులు చెల్లింపులో భాగంగా హుండీలో కానుకలు సమర్పిస్తుంటారు. ఇలా శ్రీవారికి హుండీలో సమర్పించే కానుకలు ఏటా రూ.1,600 కోట్లు దాకా ఉంటాయి. బంగారం వెయ్యి కేజీలు దాటుతుంది. ఇక వెండి అయితే నెలకి 500 కేజీల వరకు వస్తుంది. మరోవైపు భక్తులు స్వామివారికి విదేశీ కరెన్సీని కూడా కానుకలుగా సమర్పిస్తుంటారు. దీన్ని మార్చడం, బ్యాంక్‌లో డిపాజిట్ చేయడం టీటీడీకి తలనొప్పిగా మారింది. చిల్లర నాణేల నిల్వలు టన్నులు కొద్దీ ఉండడంతో వాటి విలువకంటే రవాణాచార్జీలే అధికంగా ఉండేవి. చివరికి వాటిని టెండర్ల ప్రకియలో కేజీల లెక్కన విలువ కట్టి విక్రయించాల్సి వచ్చేది. మరోవైపు నోట్లను మాత్రం బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకుంటూ వచ్చిన టీటీడీకి కేంద్రప్రభుత్వ నిబంధనల మేరకు ఏఫ్‌సీ ఆర్‌ఏ లైసెన్స్ పొందాల్సి వచ్చింది. 2011లో టీటీడీ కేంద్రానికి లైసెన్స్ జారీకోసం విజ్ఞప్తి చేసింది. 2015లో ఐదేళ్ల కాలపరిమితితో కేంద్రం లైసెన్స్ జారీ చేసింది. అది 2020 జనవరికి కాలపరిమితి ముగిసే సమయంలో టీటీడీ లైసెన్స్‌ను రెన్యూవల్ కోసం 2019లోనే అభ్యర్థించింది. అప్పట్లో మారి న చట్టం మేరకు టీటీడీకి ఇబ్బందులు తలెత్తాయి.

ఆ వివరాలు ఎలా తేవాలి?

రాష్ట్ర దేవదాయచట్టం మేరకు శ్రీవారి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు కార్పస్ ఫండ్ అంటారు. కానుకలను డిపాజిట్లుగా చేసి వాటిపై వచ్చే వడ్డీని మాత్రం వ్యయం చేయాల్సి ఉంటుంది. మరోవైపు సవరించిన కేంద్ర ప్రభుత్వ ఏఫ్‌సీఆర్‌ఏ నిబంధనల మేరకు ఫారిన్ కరెన్సీని బ్యాంకులో డిపాజిట్‌చేసే సమయంలో కరెన్సీ సమర్పించిన దాతల వివరాలు టీటీడీ తెలపాల్సి ఉంది. టీటీడీకి హుండీ ద్వారా లభించే ఫారిన్ కరెన్సీ దాతల వివరాలు ఎలా తెలపాలో అర్థంగాక టీటీడీ కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లింది. ఏళ్ల గడిచినా కేంద్రం స్పందించకపోగా.. టీటీడీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిందని భావించి రూ.14 కోట్లు ఫైన్ విధించింది. టీటీడీ పలు సంప్రదింపుల తర్వాత కేంద్రం ఆ జరిమానాను రూ.3.19 కోట్లకు తగ్గించింది. తర్వాత ఈఓ ధర్మారెడ్డి పలువాస్తవ పరిస్థితులు తెలియజేయడంతో ఎట్టకేలకు కేంద్రం దిగివచ్చింది. ఎఫ్‌సీఆర్‌ఏ చట్టం మేరకు దేశంలో ఎవ్వరికీ ఇవ్వని మినహాయింపును టీటీడీకి ఇచ్చింది. ఏఫ్‌సీఆర్‌ఏ చట్టం సెక్షన్ 50 మేరకు శ్రీవారికి భక్తులు హుండీలో సమర్పించిన విదేశీ కరెన్సీని బ్యాంకులో డిపాజిట్ చేసుకునేందుకు అంగీకరించింది. దీంతో ఫారెన్ కరెన్సీ మారకంపై టీటీడీలో నెలకొన్న సందిగ్ధత తొలగినట్టయ్యింది.

గంగమ్మ గుడి కుంభాభిషేకానికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ కుంభాభిషేకానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మే 1 నుంచి 5వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న మహోత్సవానికి పలువురు ప్రముఖులు, విశేష సంఖ్యలో భక్తుల విచ్చేయనుండడంతో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. అందులో భాగంగా ఆలయ ఆవరణలోని గోపురాలు, మండపాలకు రంగులు వేయిస్తున్నారు. భక్తులకు ప్రత్యేకంగా షెడ్లు నిర్మిస్తున్నారు. అలాగే మే 9వ తేదీన ఆరంభం కానున్న గంగమ్మ జాతరను పురస్కరించుకొని ప్రత్యేకంగా కమాండ్ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష ఆయా పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈఓ మునికృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవే

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నుంచి వంద కుటుంబాలు



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో పార్టీలో చేరిన బీసీ నేతలు

శ్రీకాళహస్తి రూరల్ : ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవలోనే ఉంటానని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని వేలవేడులో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలవేడు, మాధమాల, పల్లంపేటకు చెందిన వంద కుటుంబాల బీసీలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఓటమి చెందినా నియోజకవర్గ ప్రజల వెంటే ఉన్నానని, అందుకే 2019లో అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించారని వెల్లడించారు. అయితే చంద్రబాబు 2019లో ఓడిపోయిన తర్వాత హైదరాబాద్‌కు వెళ్లిపోయి నాలుగేళ్లపాటు తిరిగిచూడలేదని ఆరోపించారు. ఎన్నికలు సమీపించే సరికి చంద్రబాబుకు ప్రజలు గుర్తుకు వచ్చారని విమర్శించారు. ఎమ్మెల్యే అయినప్పటి నుంచి నిత్యం పార్టీ కార్యాలయంలోనే అందుబాటు ఉంటూ సేవలందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బీసీలకు సముచిత స్థానం దక్కిందన్నారు. చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అని కొనియాడారు. నామినేటెడ్ పదవులు, గ్రామస్థాయి కాంట్రాక్టు పనుల్లోనూ బీసీకు ప్రాధాన్యం కల్పించారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు సమష్టిగా పనిచేసి ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమ్మ, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగాల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, నేతలు రత్నంరెడ్డి, పెరుమాళ్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, చెలికం కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, వెంటేష్‌యాదవ్, గురునాథ్‌కుమార్, రామచంద్రారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ భానుమూర్తియాదవ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఆంద్‌రెడ్డి, మునిరాజారెడ్డి, వెంకటరామిరెడ్డి, బాల సుబ్రమణ్యం, రంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కమనీయం.. వెంకన్న కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సైదాపురం: మండలంలోని పెరుమాళ్లపాడులో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యా ణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయకర్తగా నందిమండలం ప్రసాద్‌రాజు, సర్పంచ గీత వ్యవహరించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు గూడూరులో ఎస్పీ 'స్పందన'

గూడూరు : పట్టణంలోని 1వ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించే స్పందనలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి పాల్గొంటారని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆధ్వర్యంలో జరిగే స్పందనలో సబ్ డివిజన్ పరిధిలోని సమస్యలపై వినతులు సమర్పించుకోవచ్చని సూచించారు.

హోమం నిర్వహిస్తున్న వేద పండితులు





పూజలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, తదితరులు

ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్న అర్చకులు



శాస్త్రోక్తం.. అష్టోత్తర శత శంఖాభిషేకం

ముక్కంటి ఆలయంలోని శ్రీమేధా దక్షిణామూర్తిస్వామివారికి ఆదివారం శాస్త్రోక్తంగా అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహించారు. గురు గ్రహం మీనరాశి నుంచి మేష రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా విశేష అభిషేకం జరిపించినట్లు వేదపండితులు తెలిపారు. కరుణాకర్ గురుకుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచ హారతులు, ధూప దీప నైవేద్యములు కైంకర్యం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు. అభిషేక పూజలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

పూరిళ్లు దగ్ధం



కాలుతున్న పూరిళ్లు

పెళ్లకూరు: మండలంలోని ఊడిపూడి గిరిజన కాలనీలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధితుని కథనం మేరకు.. ఊడిపూడి గిరిజన కాలనీకి చెందిన వేటగిరి నరసయ్య రెండు పూరిళ్లు ఉన్నాయి. ఆదివారం స్తంభం నుంచి ఇంటికి విద్యుత్ సరఫరా అయ్యే వైర్లలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో పూరింటికి నిప్పంటుకుంది. గాలుల తాకిడికి పక్కనే ఉన్న మరో పూరింటికి కూడా మంటలు వ్యాపించడంతో రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న వస్తు సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. స్థానికులు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. సుమారు రూ.50 వేలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు



ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే కిలివేటికి గజమాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

తడ: పేదరికమే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అ న్నారు. ఆదివారం కాదలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. మోటారుసైకిల్ ర్యాలీ చేశారు. తొలుత గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలను గురించి వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ కిలివేటి మస్తానమ్మ, ఎంపీపీ కే రఘురెడ్డి, జె డ్రీటీసీ సభ్యురాలు ఇందుమతి, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాల చంద్రారెడ్డి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కట్టా రమణారెడ్డి, అల్లూరు అనిల్‌రెడ్డి, ఎం మునీష్‌రెడ్డి, జీ సురేష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

దొరవారిసత్రం: కల్లూరు సమీపంలోని ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కల్లూరు రెవెన్యూ గ్రూపు పరిధిలోని సర్వే నంబర్ 1లో 70 ఎకరాలు, 3-ఏలో 22, 10-ఏలో 5.84 సెంట్లు అటవీ పోరంబోకు భూమి, రిజర్వు ఫారెస్టులో కలిసి పోయింది. ఈ భూముల కోసం కొన్నేళ్లుగా స్థానికులు పాటుపడగా వారం కిందట రెవెన్యూ, ఫారెస్టు శాఖలు ఉమ్మడి సర్వే చేపట్టాయి. అనంతరం అటవీ పోరంబోకు భూమిని ఫారెస్టు శాఖ రెవెన్యూ శాఖకు అప్పగించింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామంలోని కొందరు ఆక్రమణలకు యత్నించారు. దీంతో ఎస్సీ, ఎస్టీలు ఆ చర్యలను అడ్డుకోవడంతో వివాదాలు తలెత్తాయి. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డిని వివరణ కోరగా పూర్తి స్థాయిలో విచారణ జరిపి అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి భూములు ఇస్తామని చెప్పారు. అప్పటి వరకు ఎవరైనా ఈ భూముల్లో దిగితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాలపైకి దూసుకొచ్చిన కారు



ఆటోను ఢీకొన్న కారు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని సీఎస్ తేజ సెంటర్ సమీపంలో రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ఓ కారు అతివేగంగా జనాలపైకి దూసుకు వచ్చి, ఓ బైకు, ఆటోను ఢీకొని ఆగింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురై పరుగులు తీశారు. స్థానికుల కథనం మేరకు.. నిత్యం జనాలతో రద్దీగా ఉండే సీఎస్ తేజ థియేటర్ వీధిలో ఓ కారు పట్టణంలోకి వెళ్లేందుకు అతి వేగంగా దూసుకొచ్చింది. రహదారి పక్కనే బైక్‌పై నిబడిన ఉన్న వెంగమాంబపురం గ్రామానికి చెందిన సుంకర మహేష్‌ను ఢీకొంది. అక్కడ నుంచి రోడ్డు పక్కగా నిలబెట్టి ఉన్న దాసరి ముత్యాలయ్య చెందిన ఆటోను ఢీకొని ఆగిపోయింది. ఈ సంఘటనలో బైక్‌తో పాటు నిలబడి ఉన్న మహేష్‌కు గాయాలయ్యాయి. అయితే కారు నడిపిన వ్యక్తి మద్యం మత్తులో ఉండి అక్కడ నుంచి పరారైనట్లు స్థానికులు గుర్తించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సలీమ్(ఫైల్)

చిల్లకూరు: పెళ్లి చేయలేదని కుటుంబ సభ్యులపై అలిగి ఈ నెల 4 వ తేదీన గడ్డి నివారణ మందు తాగి ఆస్పత్రి పాలై చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన తిమ్మనగారిపాళెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన ఎస్కే సలీమ్(27) అనే యువకుడు కూలి పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో అతడు తనకు వివాహం చేయాలని పలుసార్లు కుటుంబ సభ్యులకు చెప్పినా వారు దాట వేస్తుండడంతో మనస్తాపం చెంది, గడ్డి నివారణకు వినియోగించే మందు తాగాడు. దీంతో అతను అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో యువకుడ్ని తిరుపతిలోని స్విమ్స్‌లో చేర్పించి చికిత్స చేయిస్తుండగా ఆదివారం వేకువజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తిరుపతి రూరల్ : చంద్రగిరి నూకలగుంట సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. శోభన్‌కుమార్, సతీష్, జ్ఞానేంద్ర, పట్టాభిరెడ్డి, రాజేంద్రరెడ్డి, లోకేష్ అనే పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.78,650, ఐదు సెల్‌ఫోన్లు, బైక్‌లను సీజ్ చేసినట్లు సీఐ ఓబులేసు తెలిపారు.

వాగు దాటుతూ ఇద్దరి మృతి





శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు మృతదేహాలు

గూడూరురూరల్ : మండలంలోని విందూరు వద్ద ఆదివారం వాగు దాటుతూ ఇద్దరు ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు. వివరాలు.. గ్రామానికి చెందిన ఏడుగురు కూలి పనుల కోసం గూడూరుకు వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతూ గ్రామ సమీపంలోని పంబలేరులో దిగారు. ఐదుగురు ఒడ్డుకు చేరుకోగా వెంకటేశ్వర్లు(37), శ్రీనివాసులు(45) అనే ఇద్దరు అదుపు తప్పి వాగులో పడి కొట్టుకుపోయారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. సుమారు 4 గంటలపాటు శ్రమించి మృతదేహాలను వెలికి తీశారు. పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు, శ్రీనివాసులకు వివాహం కాలేదు.

లారీ ఢీకొని వలంటీర్ మృతి



షేక్‌షావలీ (ఫైల్)

తిరుపతి రూరల్ : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై వేదాంతపురం సర్కిల్ వద్ద శనివారం రాత్రి లారీ ఢీకొని ఓ వలంటీర్ మృతి చెందాడు. వివరాలు.. చిగురువాడకు చెందిన వలంటీర్ షేక్ షావలీ (25) తన స్నేహితుడితో కలిసి బైక్‌పై తిరుపతి నుంచి వస్తుండగా ప్రమాదం జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సర్పంచ్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి వెంటనే మృతుడి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. వలంటీర్ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు.

కారును ఢీకొన్న బస్సు: ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన కారు

చంద్రగిరి(తిరుపతి రూరల్): భాకరాపేట కనుమ రహదారిలో ఆదివారం పీలేరు నుంచి తిరుపతికి వస్తున్న కారును వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కారు బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమజ్జయంతి విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు

వెంకటగిరి: హనుమాన్ జయంతి సందర్భంగా మే నెల 14వ తేదీన వెంకటగిరిలో నిర్వహించనున్న మోటారు సైకిళ్ల ర్యాలీని అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు కోరారు. స్థానిక పాతకోట ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం హనుమాన్ జయంతి కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలు, వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పి రాజేశ్వరరావు, బీజేపీ నేత ఎం ప్రవీణ్, జనసేన నేత జి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్, ఎం శ్రీనివాసులు, వీహెచ్‌పీ నాయకులు సుంకర రవి, ఏ శివప్రసాద్, ఏ మల్లికార్జున్, దశయ్య, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత కల్పించే పార్టీకే మద్దతు



సమావేశంలో వడ్డెర సంఘం నేతలు

శ్రీకాళహస్తి : సార్వత్రిక ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించే పార్టీకే మద్దతు ఇస్తామని వడ్డెర సంఘం నేతలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జిల్లా వడ్డెర సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా వెనుకబడిన వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అన్ని పార్టీల నేతలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 40లక్షల మంది వడ్డెర్లు ఉన్నా పాలకులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెర్లు అభివృద్ధి చెందాలంటే చట్టసభల్లో అవకాశం కల్పించాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం ఐదు అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను వడ్డెర్లకు కేటాయించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర వడ్డెర జేఏసీ చైర్మన్ వేముల సుబ్బారావు, వైస్ చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్, ప్రధాన కార్యదర్శి కోనంగి శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంటు మల్లి శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శి దేరంగుల శ్రీధర్, ఉపాధ్యక్షుడు వలిపి శ్రీరాములు, నేతలు విజయకుమార్, తేపల్లె విజయ్ శ్రీనివాస్, జెరిపిటి జయరాం, గుంజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భార్యను కత్తితో పొడిచిన భర్త

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

గూడూరురూరల్: భార్య కొంత కాలంగా విడిగా ఉంటూ మరొకరితో సహజీవనం చేస్తుండడంతో ఆగ్రహించిన భర్త ఆమెను కత్తితో పొడిచిన సంఘటన ఆదివారం రాత్రి నెర్నూరు గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గూడూరు వరదానగర్‌కు చెందిన తగరామూడి నాగరాజు అనే వ్యక్తికి శ్రావణి అనే మహిళతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరిద్దరి మధ్య మూడు నెలల క్రితం వివాదాలు నెలకొనడంతో ఇద్దరు విడివిడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆమె గాంధీనగర్‌కు చెందిన వేంకటేశ్వర్లు అనే వ్యక్తితో కలసి గూడూరు రూరల్ పరిధిలోని నెర్నూరు ప్రాంతంలోని మిరప తోటలో పనికి వచ్చారు. ఈ విషయం తెలిసిన నాగరాజు కత్తి తీసుకుని నేరుగా నెర్నూరు సమీపంలో మిరప తోట వద్దకు చేరుకుని ఆమెపై దాడి చేసి, విచక్షణారహితంగా కత్తితో పొడిచాడు. దీంతో ఆమె తీవ్ర గాయాలపాలయ్యింది. అతడిని అడ్డుకున్న నాగరాజును సైతం గాయపరిచాడు. అనంతరం నాగరాజు అక్కడ నుంచి పరారయ్యాడు. స్థానికులు గుర్తించి ఆమె గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలిచే సరికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ దశరథరామారావు, ఎస్ఐ బ్రహ్మనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): భార్యాపిల్లలు తనతో లేరని సహజీవనం చేస్తున్న మహిళ సైతం దూరమైందని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన రాజశేఖర్ (39)కు వరలక్ష్మి అనే మహిళతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా రాజశేఖర్ కారు డ్రైవర్. దంపతుల నడుమ విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో వరలక్ష్మి తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. నెల్లూరు జ్యోతినగర్‌లో రాజశేఖర్ సమీప బంధువైన ఓ మహిళ ఉంటోంది. ఆమె భర్త నుంచి విడిపోయింది. రాజశేఖర్ ఆమెతో సహజీవనం చేశారు. ఇటీవల వారి మధ్య విభేదాలు చోటుచేసుకుని దూరంగా ఉంటున్నారు. భార్యాపిల్లలు తనతో లేకపోవడం, సహజీవనం చేస్తున్న మహిళ దూరం అవడంతో అతను తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం తెల్లవారుజామున రాజశేఖర్ పురుగు మందు తాగాడో? లేక విషం తీసుకున్నాడో తెలియదు కానీ తాను సహజీవనం చేసిన మహిళ ఇంటికి వచ్చి ఏదో మందు తాగానని చెప్పాడు. దీంతో ఆమె అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించింది. రాజశేఖర్ తమ్ముడు గిరిప్రసాద్‌కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలియజేసింది. ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే రాజశేఖర్ మృతిచెందాడు. ఈ మేరకు ఆయన వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.